క్లుప్తంగా

జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక


ఎంపికైన గణేశ్

దామెర: మండల కేంద్రం లోని ఎస్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థి సూర గణేశ్ ఇన్‌స్పైర్‌మనాక్ అవార్డు 2023కు ఎంపికై నట్లు పాఠశాల కరస్పాండెంట్ కళింగరావు బుధవారం తెలిపారు. 10వ తరగతి చదువుతున్న గణేశ్ నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌మనాక్ 2023లో పాల్గొనగా తాను ప్రదర్శించిన ఎగ్జిబిట్ జాతీయ స్థాయికి ఎంపికై నట్లు ఆయన తెలిపారు. 'పవర్‌థెఫ్ట్ డిటెక్షన్ అండ్ ఇంటిమేషన్ ఎనర్జీ మీటర్ ఇన్ఫర్మేషన్‌త్రూ ఎస్ఎంఎస్ విత్ ఆటోపవర్ కట్ ఆఫ్' అనే అశంపై గణేశ్ ప్రదర్శించగా, ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో గణేశ్ పాల్గొని తన ఎగ్జిబిట్‌ను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గణేశ్‌ను, ప్రాజెక్టు గైడ్ టీచర్ శ్రీనివాస్‌ను ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు, కరస్పాండెంట్ కళింగరావు, ప్రిన్సిపల్ స్నిగ్ధరంజిత్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారుడికి అభినందన



ఆత్మకూరు: మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న సిరిపురం అక్షయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి అండర్ –11 బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం అక్షయ్‌కుమార్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ జాయిస్, వైస్ ప్రిన్సిపాల్ రోస్మి, కరస్పాండెంట్ లిస్‌మెరియ, ఉపాధ్యాయులు అభినందించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

నేడు కార్యాలయ భవన ప్రారంభోత్సవం

ఐనవోలు: మండలంలోని శ్రీమల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాంగణంలో దేవాలయ నిధులతో నిర్మించిన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం ప్రారంభించనున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. అదే విధంగా దాతల సహకారంతో చేపట్టనున్న ఎల్లమ్మ దేవాలయ పున:నిర్మాణం, కల్యాణ కట్ట, షెడ్డు నిర్మాణం, కోనేరు, కల్యాణ మండపం, అద్దాల మండపంతో పాటు పున్నేలు క్రాస్ వద్ద ఆర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

మృతదేహానికి నివాళి



ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన అనుముల రాజమల్లు అనారోగ్యంతో మృతి చెందాడు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రాజమల్లు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ మార్నేని మధుమతి, సర్పంచ్ జన్ను కుమారస్వామి, సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, తండ వెంకన్న, పరమేష్, మహేందర్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బూస ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సర్పంచ్ బరిగల సదానందం బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 3వేలు ఆర్థిక సాయం అందించారు. ముంజ కుమారస్వామి, మణికంఠ, ఇమాం, రాజు, సారయ్య, భిక్షపతి, యాకయ్య, రమేష్, మహేష్, సురేష్, నరేష్, వినోద్, ప్రశాంత్ ఉన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



కమలాపూర్ : మండల కేంద్రంలో బుధవారం వరంగల్ నగరంలోని అజర ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా జనరల్, కార్డియాలజీ, గైనకాలజీ పరీక్షలతో పాటు జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్, తదితర వ్యాధులకు సంబంధించి సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత వైద్య పరీక్షల కోసం 15 మందిని ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్‌లు సుయేష, శ్రీనాథ్, సిబ్బంది త్రివిక్రమ్, రాజేందర్, హరి, సుమన్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం


దామెర : స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ కాగితాల శంకర్


ఆత్మకూరు : స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

దామెర: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లకు బుధవారం స్పోర్ట్స్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. క్రీడలతో స్నేహబంధం పెంపొందుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీటీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గండు రాము, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, బీఆర్ఎస్ యూత్ వింగ్ మండల అధ్యక్షుడు, పులుకుర్తి ఉపసర్పంచ్ మెంతుల రాజు, సర్పంచ్‌లు గోగుల సత్యనారాయణరెడ్డి, వడ్డెపల్లి శ్రీనివాస్, తుత్తురు శ్రీనివాస్, దామెరుప్పుల శంకర్, పంచాయితీ కార్యదర్శులు, యువకులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: క్రీడలతో స్నేహబంధం ఏర్పడుతుందని ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు సీఎం కేసీఆర్ అందించిన స్పోర్ట్స్ కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అన్నారు. ప్రతీ గ్రామంలో క్రీడామైదానం ఏర్పాటు చేయడంతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్నారని తెలిపారు. యువత క్రీడల్లో రాణించి గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక, ఎంపీడీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజు, యాదగిరి, రవికుమార్, మనోహర్, ఎంపీటీసీలు వరుణ్‌గాంధీ, భాగ్య పాల్గొన్నారు.

ప్రజలకు మంత్రి 'ఎర్రబెల్లి' క్షమాపణ చెప్పాలి

● ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రజలను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ, డీవైఎఫ్ఐ, బీఎస్‌ఎస్, దళిత సంఘాల నాయకులు మారెపల్లి క్రాంతికుమార్, అరికిల్ల దేవయ్య, మంద సురేష్, మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించేందుకు అర్హుల ఎంపిక, ఇతర కార్యక్రమాలపై నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలను కించపరిచినట్లు మాట్లాడారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి పథకాలను బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు, అనుచరులకు మాత్రమే కేటాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఉనికి కోసం తప్పుడు ఆరోపణలు చేయొద్దు


మాట్లాడుతున్న మోరె వంశీయులు

పరకాల: ప్రజల్లో ఉనికి కోసం స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయొద్దని పట్టణంలోని మోరే వంశీయులు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆదేశానుసారమే శ్రీమహంకాళీ ఆలయ ప్రాంగణంలోని డబ్బాలను తొలగించారని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపించడం సరికాదన్నారు. అమరధామంలో ఎదురుగాఉన్న మహంకాళీ దేవాలయం ప్రాంగణంలోని డబ్బాలను మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో తొలగించగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కాగా దేవాలయ సంబంధిత మోరె వంశీయులు మాజీ ఎమ్మెల్యే భిక్షపతి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తమ పట్ల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఏలాంటి కోపం లేదని, రెవెన్యూ కార్యాలయానికి అనుకొనిఉన్న తమ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న డబ్బాలు తొలగించాలని అధికారులు కోరారని, దాంతో తొలగించాల్సి వచ్చిందన్నారు. పూర్తి విషయం తెలియకుండా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి రాజకీయస్వార్థం కోసం విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఆలయం ప్రాంగణం వద్దకు వస్తే తరిమికొడుతామని హెచ్చరించారు. శ్రీమహంకాళీ ఆలయ ధర్మకర్త మోరె సదానందం, రవి, రాజేందర్, రాజశేఖర్, లింగన్న, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'గ్యారంటీ' స్కీంలపై విస్తృత ప్రచారం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ స్కీం హామీలను అమలు చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కొప్పుల, జోగంపల్లి గ్రామాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటీ స్కీంపై ప్రజల్లో అపూర్వ స్పందన వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయమాటలు చెబుతుందని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చని 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తుందన్నారు. నాయకులు వలిహైదర్, వైనాల కుమారస్వామి, మామిడిపెల్లి సాంబయ్య, మారెపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, తడుక కుమారస్వామి, రాజు, చింతల రవిపాల్, మిట్టపల్లి సతీష్, వెంకటరాజిరెడ్డి, శ్రీనివాస్, శంకర్, లక్ష్మినారాయణ. చంద్రమౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫెలోషిప్‌నకు రామస్వామి ఎంపిక

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎస్.రామస్వామి యునైటెడ్ కింగ్‌డంలోని ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందుకున్నట్లు రామస్వామి బుధవారం తెలిపారు. జీవశాస్త్రంలో చేసిన అత్యుత్తమ పరిశోధనలకు ఎంపికైనట్లు వెల్లడించారు. గతంలో రామస్వామి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందాడు. పరిశోధనల నిమిత్తం అమెరికా, నెదర్లాండ్, బ్రెజిల్, శ్రీలంక దేశాలను సందర్శించారు. ఆయనను పలువురు అభినందించారు.

అభినందనలు

హన్మకొండ: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన క్రీడాకారులను బుధవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ అభినందించారు. వరంగల్ జిల్లాలోని సంగెం లో క్రీడాకారులకు కిట్ల పంపిణీ కార్యక్రమానికి బుధవారం జిల్లాకు వచ్చిన ఆయనను డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, డీఎస్‌ఏ కోచ్, క్రీడా విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ క్రీడా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, సరస్వతీనగర్, గోపాల్‌పూర్ ఎస్సీ కాలనీ, పోచమ్మగుడి, ప్రగతినగర్, లక్ష్మినగర్, విజయనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

● ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి


కండువా కప్పి ఆహ్వానిస్తున్న కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో కమలాపూర్ మండలంలోని వంగపల్లికి చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు కొలిపాక రాకేష్, ఇంద్రారెడ్డితో పాటు మరి కొందరు బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పీఏసీఎస్ డైరెక్టర్, సీనియర్ నాయకుడు తక్కల్లపెల్లి సత్యనారాయణరావు, నాయకులు కొలిపాక సాంబయ్య రామేశ్వర్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

దామెర: మహిళలు స్వయం ఉపాధిని ఏర్పరుచుకొని ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో మహిళలు నైపుణ్యాన్ని పొందాలని కోరారు. మండలంలోని కోగిల్వాయిలో పోచంపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమకాళ్లమీద తాము నిలబడుతూ ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. కుట్టుమిషన్ శిక్షణలో మెళకువలు నేర్చుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా రాణించాలని కోరారు. ఉచిత శిక్షణ అందిస్తున్న ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, కార్యదర్శి సరళ, వార్డు సభ్యులు గుండా రజినీ, జంగిలి నవ్యశ్రీ, సల్ల అర్జున్, కారోబార్ సురేష్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దసరా కానుకగా బతుకమ్మ చీరలు


ఊరుగొండలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

దామెర: రాష్ట్రంలోని మహిళలకు సీఎం కేసీఆర్ దసరా పండుగ కానుకగా బతుకమ్మ చీరలను అందిస్తున్నారని వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ అన్నారు. మండలంలోని ఊరుగొండలో బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కుల, మతాలను సమన్యాయంగా చూస్తుందన్నారు. ముస్లింలకు రంజాన్ కానుకగా తోఫా, క్రిస్టియన్‌లకు క్రిస్మాస్ కానుకలు అందిస్తే హిందువులకు దసరా పండుగకు కానుకగా బతుకమ్మ చీరలను అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం అందించిన చీరలను మహిళలు సద్దుల బతుకమ్మ రోజున ధరించాలని ఆయన కోరారు. సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కూనాటి సునీల్‌రెడ్డి, జన్ను విజయ్, మహిళలు పాల్గొన్నారు. అలాగే కోగిల్వాయిలో జరిగన కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్తర్, ఉపసర్పంచ్ సాంబయ్య, కార్యదర్శి సరళ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు


సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవిరాజు

ఆత్మకూరు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ రవిరాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే అపరిచితులు ఫోన్‌లు చేసి బ్యాంక్, ఆధార్, పాన్, ఓటీపీ వివరాలను అడిగితే నిరాకరించాలని సూచించారు. ఆడపిల్లలు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర ఆప్‌లల్లో డీపీలుగా ఫోటోలు పెట్టవద్దని, హ్యాకర్‌లు వాటిని మార్ఫింగ్ చేస్తున్నారని అన్నారు. ఇంటర్‌నెట్‌ను అవసరమైనప్పుడే వాడాలని, చదువుపై దృష్టి సారించాలని అన్నారు. సైబర్ నేరానికి గురైనట్లు అనుమానం వస్తే పోలీస్‌లను సంప్రదించాలని సూచించారు. ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు త్యాగాల దినం

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 55 రోజుల పాటు చేసిన సమ్మె సందర్భంగా ప్రాణత్యాగాలు చేసిన కార్మికులను స్మరించుకుంటూ ఈ నెల 5న త్యాగాల దినంగా పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు సిహెచ్.రాచందర్, ఇ.వెంకన్న, శ్రీనివాస్, టి.ఎల్లయ్య, యుఆర్ కృష్ణ పిలుపునిచ్చారు. డిపోల వద్ద అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించాలని కోరారు. వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోల్లో జేఏసీ నాయకులు త్యాగాల దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంచె ఏర్పాటుకు తీర్మానం

హసన్‌పర్తి: వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కేటాయించిన భూమి చుట్టూ కంచె ఏర్పాటుకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పాలకవర్గ అత్యవసర సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీకి కేటాయించిన స్థలంపై చర్చలో ఓ గదితో పాటు కంచె ఏర్పాటు చేయాలన్నారు. కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు తీర్మాన పత్రాలను డీసీఓ, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు అందించారు.

జన్మదిన వేడుకలు

హన్మకొండ : ఏకశిల విద్యా సంస్థల అధినేత డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని స్వయం కృషి వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు హేయమైన చర్య


అరెస్టయిన అంగన్‌వాడీ టీచర్లు

కమలాపూర్: తమ డిమాండ్లను నెరవేర్చాలని హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు వెళ్తున్న తమను పోలీస్‌లు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన పది మంది అంగన్‌వాడీ టీచర్లను బుధవారం ఎస్సై సీమాఫర్హీన్ ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన ధర్నాకు అంగన్‌వాడీ టీచర్లు వెళ్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద అంగన్‌వాడీలు తారస పడినట్లు తెలిపారు. వారిని ప్రశ్నించగా ధర్నాకు వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ధర్నాకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకపోవడంతో వెంటనే వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కాగా అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు లేదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ టీచర్లు శనిగరపు పద్మ, ఒస్కుల పూర్ణిమ, బుర్రి తిరుమల, అంబాల జమున, ముడిదె రజిత, జేరుపోతుల వినోద, కుక్కల శ్రీలత, కుమ్మరి కోమల, అచ్చ శారద, పద్మ అరెస్టు అయినవారిలో ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఎల్కతుర్తి: రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో బుధవారం డీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15,16,17 వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో టీచర్స్ ఫెడరేషన్ డీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజితోత్సవ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల చర్చ, విద్యారంగంలో ఏర్పడుతున్న వివిధ సమస్యలపై వక్తలు ఉపన్యాసాలు, తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాణి, మండల ప్రధాన కార్యదర్శి సంపత్, మహేందర్‌రావు, పుష్పలత, జబీనా, సుధారాణి, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు

హసన్‌పర్తి : ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన బీ ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించా రు. సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి తిరుమల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఫార్మా యూనివర్సిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. ఔషధ యూనివర్సిటీ వల్ల ఇక్కడికి ఎక్కువ మొత్తంలో పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు.

ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలు

హన్మకొండ: ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలున్నాయని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ విద్యానగర్‌లోని కళాశాలలో జరిగిన పునశ్చరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని జయపాల్ రెడ్డి జ్యోతి వెలిగించి మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మంచి స్థానాల్లో ఉన్నారన్నారు.

హైడ్రోథెరపీ యూనిట్ ప్రారంభం

హన్మకొండ అర్బన్ : నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులైన చిన్నారులలో మస్తిష్క పక్షవాతం కలిగిన చిన్నారుల అవసరార్థం ప్రతిమ హాస్పిటల్ సహకారంతో నెలకొల్పిన హైడ్రోథెరపీ యూనిట్‌ను బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న ఎన్నో రకాల సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ హైడ్రోథెరపీ యూనిట్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. కొంత మంది పిల్లలకు ఆధార్‌కార్డు లేక ప్రభుత్వం అందించే పెన్షన్‌ని అందుకోలేక పోతున్నారని కేంద్రం నిర్వాహకులు వినోద్‌కుమార్ దృష్టికి తీసుకురాగా, తక్షణమే అధికారులతో మాట్లాడుతూ పిల్లలందరికీ పెన్షన్ అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, బాలల పరిరక్షణ సమితి చైర్‌పర్సన్ అనిల్ చందర్‌రావు, నాగవాణి, వసుధ, డీసీపీఓ సంతోష్, మల్లికాంబ నిర్వాహకులు రామలీల, సదానందం,పద్మ, కళ్యాణ్,పాల్గొన్నారు.